గాలిపాటు

ఆంజనేయశర్మ అరగంటనించీ అట్లా ఆ కిటికీదగ్గిర నిలబడి ఆకాశాన్ని కప్పేస్తున్న కారు మబ్బులవంక ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

అరగంట క్రితం ఈ ఆకాశం ఎంత నిర్మలంగా ఉందీ! ఒక్క అరగంటలో ఎంత గాలివాన ముసించుకొని వచ్చిందీ! ఎంతకావాలి? గాలిపాటు!

జీవితంకూడా అంతే! తన సంగతేమిటి? ఇంచుమించు—ఒకటి రెండేండ్లు తక్కువగా—నలభై సంవత్సరాలపాటు ప్రశాంతంగా ఉన్న తన జీవితం మీద ఒక గాలి కొట్టింది. రెండునెలల కాలంలో తన జీవితంలో పెద్ద తుఫాను రేగింది. ఈ తుఫాను తన్ను ఎక్కడికి కొట్టుకు పోతున్నదో, ఏ రాతిగుట్టలమీద తన జీవితాన్ని పరిసమాప్తి చేస్తుందో ఎవరు చెప్పగలరు?

ఈ తుఫాను సాగిన కొత్తలో తను ఆ ఆవేశాన ఒళ్ళు తెలియక, "ఇదే జీవించటమంటే! జీవశక్తి ఉన్నందుకు ప్రతిఫలం ఇదే!" అనికూడా అనుకున్నాడు! ఇప్పుడాలోచిస్తే ఎంత పొరపాటు అభిప్రాయంగా కనిపిస్తున్నదీ!

ఈ తుఫాను అలలమీద తను తేలి ఈదగలిగితే! ఈ గాఢాంధకారంలో కూడా తను దారి చూసుకోగలిగితే! అప్పుడు జీవశక్తి ఉన్నందుకిదే ప్రతిఫలం అనుకోవచ్చును. పోనీ, అది లేదే! ఈ అలలు తనని ముంచెయ్యాలని చూస్తున్నై: తన జీవితాన్ని ఆవరించిన కాల మేఘాలు ఒక్క మెరుపైనా మెరవలేదు!....

ఆ కల్యాణి ఒక్కసారి తన్నుచూసి నవ్వరాదూ? ఆ తరవాత తన సంగతి ఏమైనా తనకు దిగులు ఉండదు!....

ఈ చీకట్లో గుడ్డిగా ఉండటంకంటె ఈ మెరుపుకు తన కళ్ళు గుడ్డికావటం లక్షరెట్లు వాంఛనీయం కాదూ?

అకస్మాత్తుగా భయంకరమైన మెరుపొకటి ఆకాశాన్ని తూర్పునించి పడమరకు చీల్చివేసింది. ఆ వెంటనే చెవులు పగిలిపొయ్యే ఉరుముకూడా వినవచ్చింది.

శర్మ నవ్వాడు. ప్రకృతి తన్ను పరిహసిస్తున్నది!....

చావటానికి సిద్ధంగా ఉన్నానని తెలిసిన వాడికి జరిగి పోయినదంతా వివరంగా స్ఫురణకు వస్తుందట. శర్మకు కూడా అట్లాగే గతమంతా జ్ఞాపకం రావటం మొదలు పెట్టింది—ఈ రెండు నెలలనించీ జరిగింది మాత్రమే. అంతకు పూర్వం జరిగింది కాదు. అసలు అంతకుపూర్వం జీవించటమంటే ఏమిటో అతనికి తెలియదనే!....

ఆ రోజున తను గుంటూరు రైలుస్టేషనులో ఓవరుబ్రిడ్జి మీద నిలబడి ఉండటమూ, ఎవరో తన పక్కకువచ్చి "ఏవూరండీ?" అని ప్రశ్నించటమూ, తను ఆ మనిషిని చూచేలోపల ప్లాట్‌ఫారం మీది కల్యాణి తన కళ్ళబడటమూ, అంతా అతనికి స్ఫుటంగా కళ్ళయెదట కట్టినట్టుగా ఉంది ఇప్పుడు. కల్యాణిని చూడ గానే తనకు మతిపోయింది. అంతకు పూర్వం ఎంతమంది స్త్రీలను తనుచూసి ఉండ లేదు? అప్పుడు తనేమీ కాలేదు. అప్పుడే ప్రారంభమయింది తన జీవితాన్ని తారు మారు చేస్తున్న ఈ తుఫాను. అదొక గాలి!

పక్కన ఉండి తన్ను పలకరించిన మనిషి సంగతే మరిచిపోయి తను కల్యాణివంక మూఢుడల్లే చూడటం మొదలు పెట్టాడు "చాలా అందమైన మనిషి" అని తన పక్కనున్న వ్యక్తి అనే వరకూ తన కతన్ని గురించి ఆలోచనే లేదూ!

ఆ దుర్మార్గుడు తనను వాదనలో దించాడు. "అన్ని అదృష్టాలలోకీ మనకు కావలిసిన స్త్రీ లభించటం గొప్ప అదృష్టం" అన్నాడా వెంకటేశ్వర్లు.

"అన్ని దురదృష్టాలలోకీ అని మీ ఉద్దేశం అయి ఉంటుంది" అని తను అందించాడు.

కాదన్నాడు వెంకటేశ్వర్లు. "మాట వరసకు మీకా ఆడదాని మీద మనసు పోయిందనుకోండి! మీరు తగిన విధంగా ప్రయత్నం చేస్తే, తగినంత ప్రయత్నం చేస్తే ఆమె మీకు సులభంగా లభిసుంది.... అయితే ఏమిటంటే, మనవాళ్ళు జీవచ్ఛ వాలు. వీళ్ళు మనసారా దేన్నీ కోరటం గాని, కోరిన దాని కోసరం తగినంత ప్రయత్నం చెయ్యటంగాని ఉండదు....మీరా మనిషివంక చూశారూ! ఒక్క క్షణంలో మానసికంగా ఆమెతో సమ సుఖాలూ అనుభవించారూ! ఒక్క నిట్టూర్పు విడిచారూ! ఆమె రైలెక్కి వెళ్ళిపోయిందీ! మీరు బ్రిడ్జిదిగి వెళ్ళిపోయినారూ! అంతే జీవితాదర్శం. ఇందులో ఆత్మవంచన ఏమిటంటే మనం చాలా నీతిగా ఉంటు న్నామని! ఈ నీతేమిటండి! సహం చచ్చిన వాళ్ళకూ నపుంసకులకూ తప్ప ఇప్పటి నీతిచట్టం ఎట్లా పనికివస్తుంది చెప్పండీ? ఎవరైనా నీతిగా ఉంటున్నానని చెబితే ముందు నాకు తట్టేదేమిటంటే ఈ మనిషిలో ఏదో పెద్ద లొట్ట ఉందీ అనీ!.... మీరంటే మీరుకాదు, నేనంటే నేననికాదు! మాటవరస కంటున్నాను! ఏమంటారు?" అన్నాడా వెంకటేశ్వర్లు.

"మీరు చెప్పేది నా కర్థం కాలేదు. ఇంకొకడి భార్య యొక్క ప్రేమను పొందటానికి మీరు తగినంత ప్రయత్నం ఏమి చేస్తారట? మీ రన్నట్టు మాటవర సకే నా కామె మీద భ్రాంతి కలిగినట్టయితే ఆమెతో ముందు నేను మాట్లాడటానికి అవకాశం ఎట్లాకలగాలి? ఆమె కోసరం నేను ప్రయత్నం చెయ్యడమే అధర్మం కావచ్చు! ఆమెకు తన భర్తమీద ప్రేమా, తన శరీరము మీద అభిమానమూ, తన భార్యా ధర్మంమీద గురీ లేవని ఎట్లా అనుకోగలరూ?" అన్నాడు తను.

"ఎంత అమాయకులండీ మీరూ ! ప్రేమ అనేది మానసిక ధర్మం. ప్రేమ లేకుండా వ్యభిచరిస్తున్నవారెంతమంది లేరు ? మనం మనసులో రోస్తున్న మనిషితో వెళ్ళి ఆనందించవచ్చును. మీకు అనుభవం లేదు, పాపం. శరీరంమీద అభిమాన మంటారా? స్త్రీ గాని పురుషుడుగాని వ్యభిచరించేటప్పుడు చేసుకునే ఆత్మవంచన ఏమిటో తెలుసునా ? అవతలమనిషి శరీరాన్ని మనం పొందుతున్నామనే ; మన శరీరాన్ని అవతలమనిషి కిస్తున్నామని ఎవరూ అనుకోరు ; అందుకని వ్యభిచరించటానికి శరీరాభిమానం ఎక్కడా అడ్డురాదు. ఇక భార్యాధర్మంమీద గురా ? పోనిస్తురూ ; ఎంతో పతివ్రతలుగా వున్న భార్యలను చూశాను. వాళ్ళు ఇతరత్రా పోని కారణంచేత పతివ్రతలే కాని వాళ్ళకి నగలమీద ఉన్న గురి భర్తలమీద ఎప్పుడూ ఉండదనుకోండి. సర్వేజనాః కాంచన మాశ్రయంతే.[1] ఈ కాలంలో డబ్బుతో కొనరానిదేదో మీరు చెప్పండి ; హృదయాలు సహితం మార్కెట్టులో అమ్ముతున్నవి, బాబూ ; ఈ కబుర్లెందుకు చెబుతారు !"

ఆ వెంకటేశ్వర్లును చూస్తే తనకు చెప్పరాని రోత పుట్టింది.

"ఇక ఆ విషయం పోనివ్వండి !" అన్నాడు.

"చూశారా ! ఆ ముక్కతో ఆఖరూ ; మనం దేన్నీ గాఢంగ వాంఛించలేం. బాబూ ! నేను మొదటనే మనవి చేసినే ; నే నింతసేపటినించీ మాట్లాడుతున్నాను. మీరు లౌక్యంగానన్నా సన్నడిగారా ఆ మనిషిని గురించి నాకేమైనా తెలుసునా అని ? ఎందుకడుగుతారూ ? ఆ మనిషిని మీకు ఇప్పించటం నా చేతుల్లో ఉండవచ్చును. మీకు ఆమెమీద గాఢమైన వాంఛ లేకపోయిందిగాని, ఉంటే మీకు నే నెంతయినా ఈ సందర్భములో ఉపకారం చెయ్యగలగవచ్చును ; సరే, శలవు ; నేనూ ఆ బండికే వెళ్ళుతున్నాను" అని ఆ వెంకటేశ్వర్లు బ్రిడ్జి మెట్లు దిగటం మొదలుపెట్టాడు.

ఆ సైతాను తన్ను బాగా రెచ్చగొట్టాడు. తన మగతనాన్ని ఆ వెంకటేశ్వర్లు ఛాలెంజి చేసినట్టయింది. అదీకాక ఆ కల్యాణి ఎంత వాంఛనీయగా కనిపించిందీ ; తన మనస్సులో ఆశ అనేది నాటి వెళ్ళిపోతున్నా డా సైతానుగాడు.

తను అతన్ని వెంబడించి మెట్లమీదనే పట్టుకుని, తనలో అంకురించిన ఒక్క సంశయమూ తీర్చుకున్నాడు. "ఆ మనిషి సానికాదు కద !"

"ఎబ్బే ; ఇల్లాలండీ ఇంతవరకు భర్తమోహం తప్ప పర పురుషుణ్ణి ఎరగదు ; ప్రమాణం చేస్తాను !" అన్నాడు వెంకటేశ్వర్లు.

---

1. యస్యాస్తి విత్తం స నరః కులీనః
స పండితః స శ్రుతవాన్ గుణజ్ఞః
స ఏవ వక్తా స చ దర్శనీయః
సర్వేజనాః కాంచన మాశ్రయంతి !

—భర్తృహరి - నీతిశతకం - 32

అతని ప్రమాణం ఒక్కటే అయితే తను నమ్మిఉండేవాడు కాదుగాని కల్యాణి మొహం చూస్తే తనకే తెలుస్తున్నది.

"ఆ మనిషి నాకు నిజంగా కావాలి!" అన్నాడు తను వణుకుతున్న గొంతుతో "నువ్వు నిజంగా నాకేమైనా సహాయం చెయ్యగలవా? ఎట్లా చెయ్యగలవో నాకు అర్థం కాకుండా ఉంది. కాని నీ రుణం ఉంచుకోను."

వెంకటేశ్వర్లు నవ్వాడు. ఆ నవ్వు! అది చూస్తుంటే తనకు పైత్యవికారం కూడా కలిగింది.

"ఆ మనిషే మీకు కావాలంటే నేను తప్ప మీకు సహాయం చెయ్యగల వ్యక్తి ఇంకొకడు లేడు. నా కా మనిషి మీద అంత అధికారం ఉంది. దాన్ని నేనింతవరకూ దుర్వినియోగం చేసి ఎరగను. కాస్తకూ కూస్తకూ దుర్వినియోగం చేసే తలంపుకూడా లేదులెండి" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నీ కెంత ఆశ ఉంది? నీ కా మనిషిమీద ఏవిధమైన అధికారం?" అన్నాడు తను ఈపాటికి పూర్తిగా వణికిపోతూ.

"నా కెంతో ఆశ లేదులెండి. నేనొక చిన్న వ్యాపారం తలపెట్టాను. దానికి పదివేలు కావాలి. ఆమెను నేను మీకిప్పించలేక పోతానని మీ రెన్నడూ అనుకోకండి. ఆమెను మీ వశం చేసిన మరుక్షణం కాని మీరు నాకు డబ్బివ్వవద్దు. నేనామె మొగుణ్ణే!" అన్నాడు వెంకటేశ్వర్లు నిశ్చింతగా.

సిగ్గుమాలిన వెధవ! అయితే ఏం? తనమాట దక్కించుకున్నాడు. తను కూడా ఏం చేస్తున్నదీ తెలియకుండానే పదివేలు కక్కాడు. అయిదువేలు అప్పుతెచ్చి మరీనూ!

ఈ నెల్లూరు కాపరం కూడా వెంకటేశ్వర్లు సలహా మీదనే. ఇక్కడ ఇల్లు కుదిర్చి తన దగ్గిర కల్యాణిని వదలిపెట్టి వెంకటేశ్వర్లు మళ్ళీ బెజవాడ వెళ్ళిపోయినాడు.

తను ఫలాని చోట ఉంటున్నాడని ఎవరికీ తెలియదు — శాస్త్రికి తప్ప. శాస్త్రికి తెలియకుండా వీల్లేకపోయింది. ఆ సైతాను వెంకటేశ్వర్లు తను చేస్తున్న వ్యాపారానికి ఇంకా ఒక్క వెయ్యి తక్కువయినవంటూ వచ్చాడు. అనుకున్నంతా ఇచ్చేశాను, వేధించవద్దన్నాడు తను. వెంకటేశ్వర్లు ఒక వెధవనవ్వునవ్వి, "అవును! నాకు తెలుసు. నేను రెండు మాటలవాణ్ణి కాను. నాకీ వెయ్యి అప్పుగా యివ్వండి. నేను మళ్ళీ యిస్తాను. కావలిస్తే ప్రామిసరీనోటు రాసిస్తాను!" అన్నాడు.

ఆ అప్పుకూడా శాస్త్రి ద్వారా సృష్టించవలసి వచ్చింది అదివరకు అయిదు వేలకు కూడా, పాపం, శాస్త్రే సహాయపడ్డాడు. అతనికి ఇది ఇట్లా అని ఏమీ తెలియదు.

మొదటి వారంరోజులూ కల్యాణి తనవశం కాలేదు. తరవాత ఒక విధంగా దారికి వచ్చింది. తను తృప్తిపడ్డాడా? ఈషణ్మాత్రమైనా లేదు!

తను నడివయస్సువాడు కాకుండా పాతికేళ్ళలోపు వాడయితే తృప్తిపడి ఉండును. కాని ఇప్పుడు తనకు తెలుసును — ఆమెతో కాపరం చేస్తూకూడా ఆమెను స్పృశించలేకపోవటం ఏమిటో?

తను కల్యాణితో ప్రేమ పూర్వకంగా దయగా మాట్లాడాడు. తన ప్రేమ ఆమెకు ఒక్క పిసరైనా బోధపడలేదు. ఆమె చెవికి తన మాటలేమీ యెక్కలేదు. తను ఆమెను ఆలింగనం చేసుకున్నాడు. ఆమెకది అంటలేదు. తన చేతలు ఆమెలో ఎటువంటి వికారమూ కలిగించలేదు.

తన యింద్రియాలు తన్ను వశం చేసేసినవి కాని అతను రెండు రోజులు ఆమెతో సంసారం చేసిన తరవాత "ఇక ఈమెను స్పృశించరాదు. ఆమె నా సొత్తు ఎన్నటికీ కాదు!" అనుకున్నాడు. అట్లా ఉండగలిగితే ఎంత బాగుండి ఉండేది! తను నిర్జీవ ప్రతిమతో క్రీడించటానిక్కూడా పాల్పడ్డానని తెలుసుకోటానికెంతో తలవంపులుగా ఉంది. తన వయస్సున! తన వయస్సే లేకపోతే అది తెలుసుకోవటమే సాధ్యమయ్యేది కాదేమో!

"హృదయాలు సహితం మార్కెట్టులో అమ్ముతవి!" అని హృదయమేమిటో ఎరగని ఆ దుర్మార్గుడు చెప్పటమూ, తను విశ్వసించటమూ!

కల్యాణి హృదయం ఎంతకు అమ్ముడు పోతున్నదో ఆ వెంకటేశ్వర్లు వచ్చి చెప్పగలడా? ఏమిస్తే ఆ కల్యాణి తనంతట వచ్చి తనవంక నవ్వుతూ చూస్తుంది? తనతో సరదాగా మాట్లాడుతుంది? అంతకంటె ఎక్కువకు పోనేవద్దు!

తను అజ్ఞానుడై సజీవమైన వ్యక్తికోసం చెయ్యి చాచాడు. ప్రాణంతో కూడుకున్న దేహం తనకు దొరికింది! ఆత్మ దక్కలేదు.

తనతో కాపరం చేస్తున్న కల్యాణిలో ఆత్మ లేదు. ఆమె ఉద్రేకమనే దాన్ని జయించింది. ఆమెకిప్పుడు బాధ కాని, భయం కాని, దుఃఖం కాని, ఆశ్చర్యంకాని లేదు. తను స్టేషనులో ఆనాడు చూసిన మనిషిని తనూ వెంకటేశ్వర్లూ కలిసి హత్య చేశారు. ఈ హత్యకు కనీసం ఇంక్వెస్టయినా జరగలేదు.

ఇట్లా అవుతుందని తెలిసి ఉంటే తను ఈ పని చేసిఉండడు. అసలు తన మనస్సే తనకు తెలియలేదు. తనకు నిజంగా కావలసింది కల్యాణి యొక్క ప్రేమ, ఆమె యౌవనం కాదు. ఆ మాట తను గ్రహించటానికి రెండునెలలు పట్టింది. ఇకనైనా తను గ్రహించవచ్చును-తన వయస్సునీ!

పాతికేళ్ళ లోపువాడి జ్ఞానేంద్రియాన్ని పూర్తిగా అరికట్టేదీ, వయస్సులో వివేకం సంపాయించలేనిదీ ఒక జంతువు తనలో కూడా ఉంది. ఈ రెండునెలలనించీ తను దాని ప్రబోధం వింటూ వుండిపోయినాడు. ఇక అసంభవం.

కల్యాణికి పద్దెనిమిది వెళ్ళలేదింకా. ఈ రెండునెలల నించీ తను తన వయస్సుకు సిగ్గుపడ్డాడు; ఇకనైనా తను గర్వపడటం ప్రారంభించాలి!....

ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది.

"ఎవరు వారు?" అన్నాడు శర్మ.

"శర్మ"

"శాస్త్రీ!" పాసెంజరులో వచ్చాడు కాబోలు.

శర్మ వెళ్ళి తలుపు తీశాడు. శాస్త్రి లోపలికి వస్తూ "అబ్బ! ఏమిగాలి! విశాఖ పట్టణానికి ఇరవై మైళ్ళలోకి వచ్చిందిట తుఫాను." అన్నాడు.

"మనకు ఫరవాలేదులే!" అన్నాడు శర్మ నవ్వి.

"నాకంత ధైర్యం లేదు!" అన్నాడు శాస్త్రి శర్మ వంక ఒక చిత్రమైన చూపు తిప్పి. "నీకు చాలా దగ్గిరలో ఉన్నదని చెప్పటానికి స్వయంగా వచ్చాను!"

"కూర్చో! కొంచెం నెమ్మదిగా మాట్లాడు. పక్కగదిలో కల్యాణి నిద్ర పోతున్నది!"

" ఈ వ్యవహారమేమిటో స్వయంగా కనుక్కుందామని కూడా వచ్చాను!"

"అదంతా పెద్ద పొరపాటు. నేనిట్లా పప్పులో కాలు వేస్తానని ఎన్నడూ అనుకోలేదురా, శాస్త్రీ!"

"పోనీ, త్వరలో మేలుకొన్నావంతే చాలు. నా మటుకు నాకు పశ్చాత్తాపంలో నమ్మకం ఉంది!"

"సరే, నాకు లేదు! నేనేం చెయ్యను? నిష్కారణంగా ఒక అమాయకురాలి ఆత్మను హత్య చేసేశాను. ఇప్పుడు నేనేం చేస్తే ఆ మనిషి మామూలు మనిషి అవుతుంది. ఆమె అట్లా అయిపోయిందని పశ్చాత్తాపమే కాని నాకు, నేను చేసిన పనిని గురించి ఇంకే విధంగానూ పశ్చాత్తాప పడటంలేదు. నా డబ్బు ఖర్చయిందని పశ్చాత్తాపం లేదు-"

"ఆ కోమటి నిన్ను కోర్టుకీడ్చెయ్యబోతున్నాడని పశ్చాత్తాపం ఉందా? నీకేమీ మిగలదని తెలుసుకున్నావా?"

"ఆమెను భర్తనుంచి విడదీశానని పశ్చాత్తాపం లేదు. వాడు పరమనీచుల్లో ఒకడు. ఈ సుకుమార పుష్పానికి వాడు విషవాయువు. కాని, శాస్త్రీ, కల్యాణిని చూస్తే నాకు కడుపు తరుక్కుపోతున్నదిరా! ఎవరైనా ఆమెను నవ్వించగలిగితే— పోనీ ఆమె కంట రెండు చుక్కలు కన్నీరైనా కార్పించగలిగితే—నే నామెను వారి వశం చేసి పోయి సన్యసిస్తాను. నేను ఎంతో ఆపేక్షగా ఉన్నాను. ఆమె గమనించదు. నేను తనకోసం చావటానికి సిద్ధంగా ఉన్నానని గ్రహించదు. ఇంకా ఏమో నా చేతనౌతుందని ఇంతకాలం గడిపాను. ఇక కనువిప్పయి పోయింది. నా చేత ఏమీ కాదు."

"మెల్లిగా మాట్లాడు! నన్ను గట్టిగా మాట్లాడవద్దంటివే!....సరే, ఇందాక నేనేదో చెప్పవచ్చాను. నువు వినిపించుకోలేదు!"

"వినిపించుకున్నాను. ఆ సెట్టి నన్ను కోర్టు కెక్కిస్తే ఇక్కడ నేను సెట్టిని మిగులుతా నన్నావు. పోనీ! కోర్టు కూడా ఎందుకు? అంతా సెట్టికి రాసిచ్చి నేను

అడుక్కు తింటాను....కాని కల్యాణి ఏమవుతుంది? మళ్ళీ ఆ వెంకటేశ్వర్లు వాతపడుతుంది. వాడు మళ్ళీ ఆమెను ఇంకొకరికి ఇట్లాగే అమ్ముకుంటాడు."

"దానికి నువ్వేం చెయ్యగలవు? రేపు నీదగ్గిర్నించి తన భార్యను తీసుకుపోయి ఇంకొకరికి అమ్మవచ్చును....ఎంతకు కొన్నా వీ మనిషిని!"

"ఇది కొనటమూ, అమ్మటమూ కాదు; లంచం. నన్ను ప్రేమించగలందులకు కల్యాణికి కానీ యిచ్చిఉండను. ఆ దుర్మార్గుడు ఆమెను వదిలిపొయ్యేటందుకు పదివేలు లంచం ఇస్తాను!"

"నాకంతా ఒకటిగా నే ఉంది—నువ్వేదో గొప్ప పేరు పెట్టుతున్నాననుకొంటున్నావుగాని!....నువ్వింత ఉదాసీనుడవై ఉంటావని నే నెరగను. లేకపోతే నేను స్వయంగా ఇంత దూరం రాకపోదును!" అని శాస్త్రి లేచాడు.

శర్మ నవ్వుతూ, "నిన్ను చూడటం నాకు చాలా సంతోషంగా ఉంది. పశ్చాత్తాప పడకు! నన్ను చూసి సంతోషంగా ఉందని కాస్త నిన్ను నువ్వు నమ్మించుకో. పశ్చాత్తాపపడవు!" అన్నాడు

ఈ కబుర్లతో ఏంపని అవుతుందన్నట్టు శాస్త్రి తల అడ్డంగా తిప్పి "నేను వెళ్ళిరానా? స్టేషనులో కాస్త నడుంవాల్చి, మెయిలులో తిరిగి పోతాను!" అని శాస్త్రి సెలవు తీసుకున్నాడు.

అతను వెళ్ళిన తరువాత ఎంతోసేపు శర్మ వాకిట్లో నిలబడి లోపలికి వెళ్ళబోతూ, ఆకాశం వంక చూశాడు.

ఒక్క మేఘమైనా లేదు! ఆ గాలికి ఎక్కడికక్కడ పరారి అయి ఉండాలి. అంత భయంకరంగా ముసించుకుని వచ్చిన తుఫాను మేఘాలు ఇట్టే చెల్లాచెదరై పోయినై చిత్రం.

కాని తనకు ముసించుకుని రాబోతున్న ప్రళయానికి అడ్డేముంది?

శర్మ అడుగులో అడుగు వేసుకుంటూ పడకగదిలోకి వెళ్ళాడు. తగ్గించి ఉన్న దీపం హెచ్చించి ఒక్కసారి కల్యాణి మొహం చూసి మరీ నిద్రపోదామనిపించింది. ఎంతో ప్రయత్నం చేశాడు ఆ కోరిక చంపుకుందామని. ఊరికే చూసినంతమాత్రాన పొయ్యేదేమిటని దీపం పెద్దదిచేసి చప్పుడు చెయ్యకుండా కల్యాణి పక్క దగ్గిరికి వెళ్లాడు.

కల్యాణి కళ్ళు తెరుచుకుని ఉంది. అతని మొహాన ఆశ్చర్యం చూసి, నవ్వుతూ చేతులు చాచింది. శర్మ తన కళ్ళను తను నమ్మలేకపోయినాడు, స్తంభం మాదిరిగా అట్లాగే నిలబడిపోయినాడు.

"నేనంతా విన్నాను. నాతో ఈ మాట అదివరకెందుకు చెప్పలేదూ? మావారు మీ డబ్బంతా ఎక్కడ దాచివుంటారో నే నూహించగలను. రేపే బయలుదేరి వెళ్ళి అదంతా తెచ్చుకుందాం. పొద్దుపోయింది. నిద్రపోదాం రండి!" అన్నది కల్యాణి.

ప్రచురణ: కారుణ్యం కథల సంపుటిలో, యువ కార్యాలయ ప్రచురణం, తెనాలి, ఫిబ్రవరి 1937, (మొదటి ముద్రణం)